

**119**

ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** మఠియవాడలో మురారి దేవుడు, అతని మిత్రులు చేసిన గొడవ గురించి జాయ సేనానితో చెబుతున్నాడు శుక్ర. మిత్రులను, కొందరు సైనికులు, గూఢచారులను కూడగట్టి ఆ మఠియదారుడి కుటుంబం కోసం వెదికిస్తున్నాడు మురారి. అనుమకొండ మొత్తం జల్లెడపట్టి వెతికినా.. వాళ్ల ఆచూకీ లభించలేదు. ఇలా ఉండగా.. ఓ రోజు ఉదయం మురారి బృందంలోని ఓ మిత్రుడు పరుగున వచ్చి మురారి ముందు సాగిలబడ్డాడు. రాత్రి తమ ఇంటికి ఆ మఠియ మహిళ ఓ బృందంతో వచ్చిందనీ, వాళ్లపై దాడి చేసినందుకు తన కాలో చెయ్యో.. తీసేస్తామని బెదిరించినట్లు చెప్పాడు. 'నువ్వే రక్షించాలి మురారిదేవా..' అంటూ బావురుమన్నాడు.

''ఆలోచనలో పడ్డాడు మురారిదేవుడు. ఇళ్లకు వెళ్లి బెదిరించడమే కాదు.. 'పోయి మురారికి చెప్పుకోండి!' అనడమేంటి..?

ఆ మఠియదారు యుద్ధవీరుడు, అతని భార్యకూడా అలాంటిదే. బాగా ధైర్యస్తురాలుగా కనిపించింది. కానీ, వీళ్లు కనిపించకుండా దాక్కోవడం.. తన మిత్రుల ఇళ్లకు వెళ్లి కాలో చెయ్యో తీసేస్తామని హెచ్చరించడం.. ఆమె ఒక్కరివల్ల కాదు. ఎవరో మంచి యుద్ధ తంత్రజ్ఞులే వాళ్లకు సహాయంగా నిలబడ్డారు.

అక్క! రుద్రమదేవి!! మురారి ఆలోచనలన్నీ రుద్రమదేవి చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.

అంతఃపురంలో ఆమెను వదలకుండా తిరిగాడు. ఆమె ఎప్పటిలాగే తమ్ముడితో తను చదువుకున్న గోళకీమఠ మిత్రురాళ్ల ముచ్చట్లు చెబుతోంది.

పగలు – రాత్రి ఇల్లువిడిచి వెళ్లలేదు.

నిద్ర మానుకుని మరీ కాపలా కాశాడు.

మురారి ఎంత ప్రయత్నించినా రుద్రమ వాళ్లను రక్షిస్తోంది అనడానికి లేశమైనా సాక్ష్యం దొరకబుచ్చుకోలేక పోయాడు. కానీ జాయా.. మరో వారం రోజుల్లో అతని మిత్రులందరికీ ఆమె కాలో, చెయ్యో తీయించి వేసింది. ఆ రోజున ఆ మఠియ కుటుంబంపై దాడి చేసిన మురారి మిత్రులకు ఇప్పుడు ఒక్కొక్కరికీ కాలో, చెయ్యో ఒకటి లేదు! ఇది వాస్తవం!'' చెబుతూ ఆగాడు శుక్ర.

దిగ్గున లేచాడు జాయచోడుడు.

ఏమనాలో తెలియక కూర్చుండిపోయాడు.

మళ్లా లేచాడు. అటూఇటూ తిరిగాడు.

అప్పుడు మళ్లీ చెప్పాడు శుక్ర.. మంద్రస్వరంతో.

''ఇదొక దురదృష్టకర సంఘటన జాయా. ఇది..''

గబుక్కున అడిగాడు జాయచోడుడు.

''ఇది.. ఇది బావగారికి తెలిసే ఉంటుందా..??''

శుక్ర చెప్పేలోగా మళ్లీ ఆయనే అన్నాడు..

''తెలిసే ఉంటుంది. తెలియకుండా ఎలా ఉంటుంది? వేగులు అనుమకొండలో ఆకు కదిలినా ఆయన చెవిన వేస్తారు. కాబట్టి తెలిసే ఉంటుంది.. తెలిసే ఉంటుంది..''

తనలో తాను అనుకుంటున్నట్లు బాహాటంగా అనేశాడు. గణపతిదేవుని స్పందన ఏమిటోనని జాయచోడుని ఆందోళన.

జీవితంలో ఎన్నో మిట్టపల్లాలు చూశాడు జాయపుడు. ఎన్నో దెబ్బలు.. సుడిగుండాలు.. వడిసెల రాళ్లు.. కానీ.. అవన్నీ తన జీవితాన్ని ప్రభావితం చేశాయి. ఇది దేవుడైన బావగారిని, కల్లాకపటం తెలియని అక్కను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. అంతేకాదు.. ఈ ధోరణి కాకతీయ సామ్రాజ్యానికి వేరుపురుగు. సందేహం లేదు. ఇది పెరిగిపెరిగి.. చ చ్ఛ.. పెరగదు. పెరగకూడదు.

లేచి నిలబడ్డాడు. ఓ ఆలోచన అతణ్ని ఆహ్లాదపరిచింది.